

# ఫ్లాష్ బ్యాక్



పాతసినిమాలకు సంబంధించిన విశేషాలు.. నటీనటుల గురించి, సినిమాల గురించి, సాంకేతిక నిపుణుల గురించి.. వగైరా..వగైరా. ప్రతినెలా ఓసారి అలనాటి సినీరంగంలోకి తొంగిచూద్దాం

## తాతినేని ప్రకాశరావు

### ( *కినిమా 1954 ఏప్రిల్* నుంచీ పునర్ముద్రణ)



**సినిమారంగానికి** సంప్రదాయాలు లేవు. ఇందులోకి వచ్చే నటులూ, డైరెక్టర్లూ. టెక్నీషియనులూ వివిధ రంగాలలోంచి వస్తారు. కొందరు స్టేజిమీది అనుభవంతో సినిమా నటులవుతారు. మరికొందరు స్టేజి మొహం చూడకుండానే నేరుగా సినిమాలలో నటులుగా చేరి క్షణంలో తారత్వం సంపాదించుకుంటారు. ఇంకా కొందరు స్టేజి మీద పెద్దపేరు తెచ్చుకుని కూడా సినిమా రంగంలోకి అడుగు పెట్టలేకపోతారు. డైరెక్టర్లలోకూడా అంతే. మనకీనాడున్న సినీ డైరెక్టర్లలో ఒకరికి గల "బాక్‌గ్రౌండ్" మరొకరికి లేదు. గతమాసం విడుదలైన "నిరుపేదలు" చిత్రాన్ని డైరెక్టు చేసిన తాతినేని సూర్యప్రకాశరావు యువజన సంఘాలనుంచీ, వాటికి అనుబంధంగా ఉండిన ప్రజా నాట్యమండలినుంచీ వచ్చినవాడు. ప్రజలకు సన్నిహితమైన కళాప్రదర్శనాలలో ఆయనకు అయిదారేళ్ళ అనుభవం ఉంది.

తాతినేని స్వగ్రామం కృష్ణాజిల్లాలోని కపిలేశ్వరపురం. ఆయన పితామహులదీ, మాతామహులదీ కూడా ఆ గ్రామమే. 1924 నవంబరు 24న ఆయన జన్మించాడు. తండ్రి వీర రాఘవయ్యగారు నిజాయితీగల కాంగ్రెసువాది. 1931లో జైలుకు వెళ్ళారు. ఈయన దత్తాత్రేయ మోటార్ సర్వీస్ నడపటం

వల్ల ఆయనను "కారు" వీర రాఘవయ్యగారనేవారు. ఈయన జైలునించి తిరిగి వస్తూనే జిల్లా బోరుడు ఎన్నికలలో చాలా శ్రమపడి పనిచేసి, శ్రమఫలిగంగా 1934 అంతంలో అకాలమరణం పాలైనారు.

తండ్రిగారి రాజకీయ చైతన్యం ప్రశారావు జీవితం మీద విచిత్రప్రభావాన్ని ప్రసరించింది. ప్రకాశరావును చిన్నతనంలో చినతాతగారు, తాతినేని సుబ్బయ్యగారు లక్షాధికారి దత్తత తీసుకున్నారు. కావటానికి సుబ్బయ్య గారు కూడా కాంగ్రెసువాడే. ఒకప్పుడు గాంధీగారు వారింట బసచెయ్యటమూ, మీటింగులకైతేనేం, చందాలకైతేనేం సుబ్బయ్యగారు పదివేలు ఖర్చుచెయ్యటమూ జరిగాయి. కాని ప్రకాశరావు తండ్రిగారు పంచాయితీ బోర్డు ఎన్నికలలో కాంగ్రెసు పక్షాన పనిచెయ్యటం సుబ్బయ్యగారికి రుచించలేదు. సుబ్బయ్యగారి ఇష్టప్రకారం జస్టిస్ పక్షాన పని చెయ్యటం వీర రాఘవయ్యగారికి రుచించలేదు. ప్రకాశరావు దత్తత రద్దుకాబడింది. సుబ్బయ్యగారు మరొకరిని దత్తత చేసుకున్నారు. ఇది జరిగిన కొద్దికాలానికే వీర రాఘవయ్యగారు మరణించారు. డిప్రెషన్ మూలంగా కారు సర్వీసు పూర్తిగా దెబ్బతిన్నది. ప్రకాశరావు పైతృకం పూర్తిగా తుడిచిపెట్టుకుపోయింది.

ప్రకాశరావు తల్లిగారు కూడా భర్తలాగే రాజకీయ చైతన్యంగల వ్యక్తి. ఆమె ప్రోత్సాహంతో ప్రకాశరావు చిన్నవాడుగా రాజకీయ మీటింగులలో పాటలూ అవీ పాడుతూండేవాడు. ఆనాటికే ఆయనలో కూడా రాజకీయ చైతన్యం అంకురించింది. తండ్రిపోయాక, తల్లిగారి సంరక్షణలోనూ, మేనమామ అయిన చిగులూరి శేషయ్యగారి సంరక్షణలోనూ పెరుగుతూ, కపిలేశ్వరపురం మిడిల్ స్కూలు చదువు పూర్తిచేశాడు.

ఈ స్కూలులో చదువుకుంటున్న కాలంలోనే ప్రకాశరావుకు సినిమా వ్యామోహం పట్టుకున్నది. కపిలేశ్వరపురానికి రెండు మైళ్ళ దూరాన వీరంకిలాకువద్ద కాజ వెంకట్రామయ్యగారి టూరింగ్ సినిమా ఆడుతుండేది. ప్రకాశరావు ఒంటరిగా ప్రతిరోజూ స్కూలునుంచి అక్కడికి నడిచివెళ్ళి, సినిమా ఆపరేటర్ను మంచి చేసుకోవటానికి గాను అతనికి బీడీలూ, సోడాలూ తెచ్చిపెట్టి. అతని సహాయంతో కొంతసేపు సినిమా చూసి ఇంటికి తిరిగి వస్తూండేవాడు.

ఒకరోజు ప్రకాశరావు పుస్తకాలు పట్టుకుని బడికిపోతూ ఆగి అప్పుడే గోడకు అంటించిన సినిమా పోస్టరుకేసి తదేకధ్యానంగా చూడసాగాడు. కొంతసేపటికి సుంకర చంద్రశేఖరంగారనే ఆయన అటుగా వచ్చి ప్రకాశరావును చూసి ఆగారు. ఆయన ప్రకాశరావుకు స్కూల్లో హిస్టరీ మాస్టరు. ఇంటివద్ద ప్రైవేటు ట్యూటరు. తనను చూడగానే ప్రకాశరావు ఎందుకు పరుగెత్తిపోలేదో ఆయనకు అర్ధమయింది. ఆయనకూడా పోస్టరువంక చూసి, ప్రకాశరావు వీపుమీద చెయ్యివేసి. "నీ పేరు కూడా అట్లా పొస్టరు మీద ఎక్కాలనుందా? సరే, ఎక్కుతుందిలే. విచారించకు" అన్నారాయన. ఆయన ఆనాడన్నమాట అక్షరాలా జరిగింది...

ప్రకాశరావు స్వగ్రామంలో థర్డ్ ఫారందాకా చదివిన తరవాత హైస్కూలు చదువుకు తాడంకి వెళ్ళవలిసి వచ్చింది అప్పటికి వారి కుటుంబం ఆర్ధిక చిక్కులలో పడింది. ఊళ్ళోని కాంగ్రెసువాదులూ, వీరరాఘవయ్యగారి మిత్రులూ అయిన

కొందరు చందాలు వేసుకుని ప్రకాశరావు చదువుకు సహాయపడ్డారు. స్కూలులో ప్రకాశరావుకు తెలుగులోనూ, హిస్టరీలోనూ చాలా మంచిమార్కులు వస్తుండేవి. బాడ్మింటన్ ఛాంపియన్. పద్యాలు చాలా బాగా రాగయుక్తంగా చదివేవాడు. మేస్టర్లు అతనిచేత అవకాశం దొరికినప్పుడల్లా పద్యాలు పాడించేవారు. అన్నీ బాగానే వున్నాయిగాని ప్రకాశరావు విద్యార్థి రాజకీయాలలో చురుకుగా పనిచెయ్యటం హెడ్మాస్టరుగారికి నచ్చలేదు. కాంగ్రెసు రాజకీయాలకు పేరుపడ్డ గ్రామంలో ప్రకాశరావు ఏకైక వామపక్షవాది అయిపోయాడు. ఈ కారణంగా చదువు కాస్తా దెబ్బతిన్నది.

ఇక చదువు ఆశలేదు గనకనూ, ప్రకాశరావు బుద్దిని రాజకీయాలమీదనుంచి మళ్ళించడానికి, మేనమామగారు అతన్ని సినిమా ఆపరేటర్ అప్రెంటిస్‌గా కుదిర్చారు. ప్రకాశరావు ఈ పని చేస్తూ కొన్నాళ్ళు వీరంకిలాకులో గడిపి అనంతరం తెనాలి తాలుకా కొల్లూరు గ్రామానికి మారాడు. ఈ కొల్లూరులో కొతకాలం గడిపాక ప్రకాశరావుకు మళ్ళీ రాజకీయాలు తగిలాయి. కొల్లూరునుంచి తెనాలికి 1939లో ఒక ఆకలి యాత్ర బయలుదేరింది. ఈ యాత్రకు ప్రకాశరావు నాయకత్వం వహించి తెనాలి చేరి అరెస్టయాడు. ఆపరేటర్ ఉద్యోగం కాస్తా బర్తరఫ్ అయింది.

అప్పటినుండీ ప్రకాశరావు యువజన సంఘాలకు చెందిన సాంస్కృతిక కార్యక్రమాలలో చేరి పని చేయసాగాడు. వీటిని కొనసాగించినది ప్రజానాట్యమండలి. కళలను ప్రజల పరం చేసే ఆశయంతో బయలుదేరిన ఈ ప్రజానాట్యమండలి ఆధ్వర్యాన నాటకాలూ, నాటికలూ మాత్రమేగాక, జానపద కళాస్వరూపాలైన బుర్రకథలూ, బృందగానాలూ, జానపద నృత్యాలూ, వీధి నాటకాలుకూడా ప్రదర్శించబడ్డాయి. ప్రతి వేసవిలోనూ క్యాంపులు పెట్టి ఈ కళారూపాలను తయారు చేసేవారు.

నేటి సినిమా నటులలో చదలవాడ కుటుంబరావు, లక్ష్మీ పెరుమాళ్ళు, మిక్కిలినేని రాధాకృష్ణమూర్తి మొదలైన వారు ప్రజానాట్యమండలిలో తర్ఫీదు పొందినవారే. కోడూరు అచ్చయ్యగారు అదివరకే స్టేజినటుడు. ఆయనకూడా ఈ క్యాంపులలో చేరి పనిచేశారు. ఈ కళాకృషిలో ప్రకాశరావు అయిదారేళ్ళు గడిపాడు.

ఆంధ్రలో అభ్యుదయ రచయితల సంఘం ఏర్పడ్డాక ప్రజానాట్యమండలి ఈ సంఘానికి అనుబంధ సంస్థగా మార్చబడింది. 1946 మే నెలలో మద్రాసులో అభ్యుదయ రచయితల సంఘం న్యాయమూర్తి రాజమన్నార్‌గారి అధ్యక్షతను సమావేశమైనప్పుడు ప్రకాశరావుకూడా మద్రాసు వచ్చాడు. ఆ సందర్భంలోనే డైరెక్టర్ ప్రసాద్‌గారితో ఆయనకు పరిచయం కలిగింది. ఈ పరిచయమే మరి కొంతకాలానికి ప్రకాశరావు సినిమారంగం ప్రవేశించేటందుకు ఆధారభుతమయింది.

1947లో చిన ఓగిరాలలో యూత్ ఫెడరేషన్ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి రష్యా, జెకోస్లోవేకియా. ఫ్రాన్స్, బెల్జియం వగైరా దేశాలనుంచి డెలిగేట్స్ హాజరయ్యారు. దీనికి మన ప్రకాశరావు అధ్యక్షుడు. సమావేశం ముగిసినాక ప్రకాశరావు మీద విమర్శలు బయలుదేరాయి. ఆయన అధ్యక్షోపన్యాసం తగినంత "రాజకీయంగా" లేదని

ఆరోపించబడింది. ఆయన సినిమా చిత్రాలు తరుచు చూస్తాడనే ఆరోపణ కూడా ఒకటి వుంటూ వచ్చింది. వీటన్నిటి ఫలితంగా ప్రకాశరావు యువజన సంఘకార్యకలాపాలకు స్వస్తి చెప్పి మద్రాసు వచ్చేశాడు, ప్రసాద్‌గారిని చూశాడు. ప్రసాద్‌గారు ప్రకాశరావును తన అసిస్టెంటుగా వుంచుకోవటానికి అంగీకరించారు. ఇది 1947 మే నెలలో.

1947 జూన్ 12న "ద్రోహి" షూటింగు ప్రారంభమయింది. డైరెక్షన్ ప్రసాద్‌గారిది. ఆయనవెంట ప్రకాశరావుకూడా పని చేయసాగాడు. "ద్రోహి" తరువాత "మనదేశం", దాని అనంతరం "సంసారం" జరిగాయి. "సంసారం" కొంత అయాక షూటింగు నిలిచిపోయింది.

ఈ సమయంలో విజయవారు ప్రసాద్‌గారితో తమ తొలిచిత్రం "షావుకారు" తలపెట్టారు. ప్రసాద్ గారి సిఫార్సుతో ప్రకాశరావు ఈ సంస్థలో అసిస్టెంట్ డైరెక్టర్‌గా చేరాడు. విజయా సంస్థలోకి రావటం తన సినిమా జీవితానికి పెద్ద ముందడుగుగా భావిస్తాడు ప్రకాశరావు. ఒకటేమిటంటే,. ఇప్పుడు తాను ఫస్ట్ అసిస్టెంట్ డైరెక్టర్ పూర్వంకన్న బాధ్యత హెచ్చింది. మరోటేమంటే ఇప్పుడు చక్రపాణిగారితో కలిసి చిత్రనిర్మాణం అన్ని శాఖలూ తెలుసుకునే అవకాశం చిక్కింది. కథను గురించిన చర్చలు లగయితూ, ఎడిటింగ్‌దాకా చక్రపాణిగారు ఎట్లా పని చేయిస్తారో, ఏమి విమర్శిస్తారో, ఏయే లోపాలను ఎట్లా సవరిస్తారో, యేది మంచో, ఏది చెడో, యెందుకో తెలుసుకునే అవకాశ్మ ప్రకాశరావుకు సిద్దించింది. తనకు ఫలాన చిత్రంలో ఫలాన పనిమాత్రమే వుందని చేతులు ముడుచుకుని కూచోకుండా ప్రకాశరావు వాహినీ స్టూడియోలో అన్ని షూటింగులకూ హాజరయేవాడు. అన్ని పనులూ గమనించేవాడు.

"షావుకారు" అనతరం "పాతాళభైరవి" కూడా చూసే అవకాశాన్ని కె.వి.రెడిగారు ప్రకాశరావుకిచ్చారు.

ప్రకాశరావు అసిస్టెంట్ డైరెక్టర్‌గా విజయాలో పనిచేసిన ఆఖరు చిత్రం "పెళ్ళిచేసిచూడు", ప్రసాద్‌గారి డైరెక్షన్. ఈ చిత్రం రీ రికార్డింగ్ జరుగుతూండగా ప్రకాశరావుకు స్వతంత్రంగా చిత్రం డైరెక్ట్ చేసే మొదటి అవకాశం, పీపుల్స్ వారి "పల్లెటూరు"తో లభించింది.

ఆనాటినుంచి ఈనాటి వరకూ ప్రకాశరావుకు ఇద్దరే గురి – చక్రపాణీ, డైరెక్టర్ ప్రసాద్. కథ గురించి ఆలోచించేటప్పుడు "చక్రపాణిగారైతే ఈ సన్నివేశాన్ని యెట్లా రాస్తారు?" అనీ, షూటింగ్ సమయంలో, "ప్రసాద్‌గారైతే ఈ సీన్ యెట్లా టేక్ చేస్తారు?" అని ఆలోచించిగాని తాను ముందుకు సాగనని ప్రకాశరావు అంటాడు. మొదట "పల్లెటూరు" కథా, తరువాత "పిచ్చిపుల్లయ్య" కథా, "నిరుపేదలు" కథా, ఇప్పుడు తీస్తున్న "పరివర్తన" కథ కూడా ప్రకాశరావు చక్రపాణిగారితో చర్చించినవే.

సినిమా చిత్రాలకు ప్రయోజనం ఉండాలనీ, అవి ప్రజల ఆలోచనలను రేకెత్తించాలనీ ప్రకాశరావు నమ్మకం. అటువంటి చిత్రాలే ఆయన తీసుకుంటాడు. కేవలం డైరెక్షన్‌తో తన పని తీరిపోయినట్టు ఆయన భావించడు. చిత్రనిర్మాణం అన్ని రంగాలనూ తాను చూసుకుంటాడు. చిత్రానికి ఆకారం ఇచ్చే బాధ్యత నటులకు వదిలివెయ్యక వారినుంచి ఏపని

చేయించుకోవాలో ముందుగా తనే నిర్ణయించుకుని, తనకు కావలిసినదానిలో కొంతలో కొంత అయినా వచ్చేటట్టు చూసుకుంటాడు. ఏనాటికైనా తాను తయారు చేయాలనుకుని ప్రకాశరావు కలలుగనే చిత్రాలు మూడు: "అల్లూరి సీతారామరాజు", "వీరేశలింగం", "ఖడ్గతిక్కన" వీటిలో మొదటిది నేషనల్ ఆర్ట్‌వారు ప్రకటించారు. మిగిలినవైనా తీసే అవకాశం ప్రకాశరావుకు లభిస్తుందని ఆశిద్దాం.

ఈ యువదర్శకుడికి కావలిసినంత కళానుభవమూ, పట్టుదలా, క్రమశిక్షణా వున్నాయి. వీటి సహాయంతో ఈయన ఎంత ఔన్నత్యాన్నయినా సాధించగలడనటానికి సందేహంలేదు.

Post your comments